ఈనాడు
అల్లూరి సీతారామరాజు
బుధవారం 23 అక్టోబరు 2024

ఈ-కేవైసీకి బారులు


పాడేరు ఇండేన్ గ్యాస్ గోదాం వద్ద వేచి ఉన్న వినియోగదారులు

పాడేరు, న్యూస్‌టుడే: దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ-కేవైసీ చేసుకుంటేనే ఉచిత గ్యాస్‌కు అర్హులవుతారని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జి.మాడుగుల, హుకుంపేట, పాడేరు మండలాల నుంచి వినియోగదారులు సోమవారం ఉదయాన్నే వందల సంఖ్యలో పాడేరు చేరుకున్నారు. వీరంతా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు బారులు తీరారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. మరోపక్క తప్పనిసరిగా గ్యాస్ పైపు మార్చుకోవాలని అధికారులు వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ-కేవైసీ కోసం వస్తే పైపుల పేరుతో రూ. 200 వసూలు చేస్తున్నారని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తుపానుపై కంట్రోల్ రూం ఏర్పాటు

పాడేరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం, కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 28 వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం ప్రకటించిన నేపథ్యంలో పాడేరులో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విపత్కర పరిస్థితుల్లో కంట్రోల్ రూం నంబర్ 94906 10026ను సంప్రదించాలని చెప్పారు. అధికారులు, సిబ్బంది అన్నివేళలా సిద్ధంగా ఉండాలని ఎస్ఈ ఆదేశించారు.

★ అక్టోబర్ 1న మునగపాకలో వినాయక ప్రతిమ ఊరేగిస్తున్న తరుణంలో డీజే బాక్స్‌ల కనెక్షన్లు కలుపుతున్న సమయంలో పోలవరపు శ్యామ్ (22) మరణించారు.


★ అక్టోబర్ 8న అనకాపల్లి మండలం బవులువాడలో భవానీమాత పూజలో విద్యుదాఘాతంతో రోమాల సాయి (19) చనిపోయారు.

★ అక్టోబర్ 4న బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరంలో ఈదురుగాలులకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగలడంతో భవానీ శంకర్ (15) మరణించారు.

★ ఆందోళన కలిగిస్తున్న విద్యుదాఘాతం కేసులు

★ ఈ నెలలోనే ఎనిమిది మంది మృత్యువాత

కాటేస్తున్న కరెంటు తీగలు!



ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి

★ అక్టోబర్ 7న నక్కపల్లికి చెందిన ఆకి నారాయణమ్మ (58) కిరాణా వ్యాపారి ఇంటి గేటు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయారు.

★ ఇటీవల అల్లూరి జిల్లాలోని కూంబింగ్‌లో ఉన్న సీఆర్‌పీఫ్ ఏఎస్ఐ ఒకరు అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగిలి చనిపోయారు.

ప్రమాదానికి కారణం	2023-24
పంప్‌సెట్ల వినియోగంలో	2
ఇళ్లల్లో అంతర్గత వైరింగ్ సమస్యలు	6
చెట్లు కొమ్మలు తెగిపడి	4
నిర్మాణ పనుల సమయంలో తీగలకు తగిలి	6
చెట్ల కొమ్మలు కొడుతుండగా తీగలు తగిలి	4
ఫ్లెక్సీలు కడుతుండగా	2
స్తంభానికుంటే స్టే వైరు పట్టుకుని	1

కరెంటు తీగలు కాటేస్తున్నాయి.. ఏమరుపాటు, అజాగ్రత్త కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గతేడాది 25 మంది వరకు విద్యుదాఘాతంతో చనిపోగా ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నాయి. వెలుగులోకి రాని కేసులు ఇంకా చాలానే ఉంటాయి. ఒక్క ఈనెలలోనే అనకాపల్లి జిల్లాలో ఎనిమిది మంది విద్యుదాఘాతంతో చనిపోయారు. వర్షాకాలంలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యుత్తు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ వాటి ఫలితాలు కనిపించడం లేదు.

వర్షాకాలంలోనే ఎక్కువ...

విద్యుత్తు ప్రమాదాలు ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా జరుగుతుంటాయి. వ్యవసాయ మోటార్ల దగ్గర తడిసిన స్విచ్‌లు వేస్తుంటారు. గాలులకు కరెంటు తీగలు వేలాడి అవి తగిలి రైతులు నేలకూలిపోతున్నారు. వినాయక నవరాత్రుల నుంచి వివిధ మాలలు ధరించి పూజలు చేస్తుంటారు. వీరు ఎక్కువగా తడి వస్త్రాలతోనే ఉంటారు. ఈ క్రమంలో కొంతమంది ఏమరుపాటుగా విద్యుత్తు ఉపకరణాలను పట్టుకుని విద్యుదాఘాతానికి గురైనవారు ఉన్నారు. ప్రస్తుతం అయ్యప్ప మాలధారణ పూజలు మొదలయ్యాయి. ఆయా పీఠాలు దగ్గరకు వెళ్లి విద్యుత్తు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాల సమయంలో పక్కనే ఉన్న తీగలు తగిలి చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇళ్ల మేడలపై దుస్తులు ఆరబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు తీగలకు దుస్తులు తగిలి షాక్‌కు గురవుతున్నవారు ఉన్నారు. ఫ్లెక్సీలు కడుతున్న సమయంలో కరెంటు తీగలు తగిలి మృతిచెందినవారు ఉన్నారు.

ఈ జాగ్రత్తలు అవసరం...

- తడిసిన స్తంభాలను తాకవద్దు.
- విద్యుత్తు లైను తగులుతున్న చెట్లను పట్టుకోరాదు.
- ఇంట్లో స్విచ్‌బోర్డులపై తడిచేతులు పెట్టకూడదు.
- చిన్నపిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలి.



- గాలులు, వర్షాల సమయంలో నేలపై పడిన విద్యుత్తు తీగలను తాకరాదు.
- వాటర్ హీటర్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. స్విచ్ ఆఫ్‌చేయడంతోపాటు ప్లగ్ బయటకు తీసిన తర్వాతనే ఆ పరికరాన్ని బయటకు తీయాలి.
- ఇంట్లో వాడే ప్రతి కరెంటు వస్తువుకు ఎర్త్ వైర్ తప్పనిసరిగా వాడాలి.

ప్రతినెలా అవగాహన..

విద్యుత్తు ప్రమాదాలపై ప్రతి నెలా 2వ తేదీన మా సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. వర్షాకాలంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు పరికరాల వినియోగంలో ఏమరుపాటుగా ఉండకూడదు. విద్యుత్తు సరఫరాలో ఏ సమస్య వచ్చినా 1912 నంబర్‌కి ఫోన్ చేస్తే చాలు. ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించవద్దు.

– గొప్పు ప్రసాద్, ఈపీడీసీఎల్ ఎస్ఈ, అనకాపల్లి

పంటకు నష్టం.. రైతుకు కష్టం


మొక్కకు ఒక బంగాళాదుంప

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మన్యంలో అధిక వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కూరగాయలు సాగుచేసిన రైతులు దిగుబడులు రాక ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బంగాళాదుంప సాగు చేపట్టిన రైతులు కనీసం పెట్టుబడి చేతికందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోడిపుట్టు, పేటమాలిపుట్టు, వనబసింగి, గూడమాలిపుట్టు, గత్తురమండ గ్రామాల్లో గిరి రైతులు సుమారు 30 ఎకరాల్లో బంగాళాదుంపలు సాగు చేశారు. ఉద్యాన శాఖ, ఐటీడీఏ రాయితీపై విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఒడిశాలోని వారపు సంతల్లో విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేపట్టారు. అధిక వర్షాలతో వరద నీరు సాగు భూముల్లో చేరి మొక్కలు నీటమునిగి నష్టపోయారు. నాణ్యమైన విత్తనాలు లేక, అధిక వర్షాలతో మొక్కలకు దుంప దిగుబడి రాలేదని, కొన్ని మొక్కలకు ఒకే దుంప పట్టి, నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కూరగాయల సాగు విస్తరణకు సాగులో మెలకువలతోపాటు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు, ఐటీడీఏ సమన్వయంతో రైతులకు శిక్షణ, సస్యరక్షణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వరద తగ్గాక గండిపోశమ్మ దర్శనాలు


గండిపోశమ్మ ఆలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీసుధారాణి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ ఆలయాన్ని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.లక్ష్మీసుధారాణి మంగళవారం సందర్శించారు. గోదావరి వరదల నేపథ్యంలో జులై 15 నుంచి మూడు నెలలకు పైగా గండిపోశమ్మ దర్శనాలను ఆలయాధికారులు నిలిపివేశారు. ఈ క్రమంలో ఆలయాన్ని సందర్శించిన ఆమె ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆలయం వద్ద వరద తగ్గిన అనంతరం దర్శనాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఏపీ జెన్‌కో అధికారులను కలిసిన ఆలయ అధికారులు అమ్మవారి ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యనిర్వహణాధికారి జి.వి.లక్ష్మీకుమార్, జూనియర్ అధికారి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కొరడా?

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం పాడేరు శివారులో ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపుపై రెవెన్యూశాఖ దృష్టి సారించింది. సుమారు 20కి పైగా దుకాణాలు ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసినట్లు రెవెన్యూశాఖ ఇప్పటికే తేల్చింది. వాటిని తక్షణమే తొలగించాలని మంగళవారం నోటీసులు జారీ చేసింది.

నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు

పాడేరు జిల్లాకేంద్రంగా ఆవిర్భవించడంతోపాటు జాతీయ రహదారి మంజూరు, వైద్య కళాశాల అందుబాటులోకి రావడంతో చింతలవీధి ప్రాంతంలో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. పాడేరు-అరకులోయ జాతీయ రహదారి చింతలవీధి మీదుగా వెళ్లడం ఈ ప్రాంతానికి కలిసొచ్చింది. పర్యాటక ప్రదేశాలైన బొర్రా గుహలు, చాపరాయిని చూసిన పర్యటకులు వంజంగి మేఘాలకొండ, కొత్తపల్లి జలపాతం, తాజంగి, లంబసింగిని చూడాలంటే చింతలవీధి మీదుగానే చేరుకోవాలి. ఇన్ని అనుకూల పరిస్థితులు ఉండటంతో భూముల ధరలకు విపరీతమైన డిమాండు పెరిగింది. మైదాన ప్రాంతాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ధర పలుకుతోంది. దీంతో దుకాణ సముదాయాలు పెరుగుతూ వస్తున్నాయి. దీనిని అవకాశంగా చేసుకుని పలువురు ఇక్కడున్న ప్రభుత్వ, గ్రామకంఠం భూములు సైతం ఆక్రమించి నిర్మాణాలు మొదలెట్టారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని పలు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్‌లకు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ స్పందించి చింతలవీధికి ఇరువైపులా ఆక్రమణలపై సర్వేచేసి తనకు నివేదిక ఇవ్వాలంటూ పాడేరు తహసీల్దార్‌కు త్రినాధనాయుడును ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఇటీవల చేసిన సర్వేలో సుమారు 20కి పైగా దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినట్లు తేల్చారు. ఈ నివేదికను కలెక్టర్, సంయుక్త కలెక్టర్‌కు అందించారు. ఈ కట్టడాలకు మార్కింగ్ సైతం చేశారు. దీంతో సంబంధిత దుకాణదారులకు నోటీసులివ్వడంతోపాటు వారిపై కొరడా ఝుళిపించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.


చింతలవీధిలో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు

నిర్మాణాలు నిలుపుదల చేయించాం: చింతలవీధి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వే చేయించాం. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి ప్రస్తుతం నిలుపుదల చేశాం. విచారణ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్ గౌడ్, సంయుక్త కలెక్టర్

మద్యం తయారీలో మాయలెన్నో!

★ డిస్టిలరీలు కేంద్రంగా అక్రమాలపై సీఐడీ తనిఖీలు ★ పలు రికార్డులు, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం

ఈనాడు, అనకాపల్లి, అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే


తనిఖీకి వచ్చిన అధికారులు

వైకాపా హయాంలో మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకు అన్నింటా అడ్డదారులు తొక్కారు. నాసిరకం మద్యం అమ్మి మందుబాబుల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారు. డిస్టిలరీల నుంచి అనధికారికంగా మద్యం తరలించి పన్నులు చెల్లించకుండా రూ. కోట్లు కొల్లగొట్టారు. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి వాసుదేవరెడ్డిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారుచేసే డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్‌బీ డిస్టిలరీల్లో మంగళవారం సీఐడీ తనిఖీలు నిర్వహించింది. గత అయిదేళ్లలో ఈ రెండు చోట్ల ఎంత మద్యం తయారు చేసింది. అధికారికంగా ఎంత అమ్మకాలు చేసిందీ, ఎంత పక్కదారి పట్టించిందీ క్షుణ్ణంగా పరిశీలించారు. పదిమంది అధికారుల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేపట్టి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక్కడ గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందించేవరకు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.


డిస్టిలరీల్లోనే మాయ..: గత అయిదేళ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలు సాగించినా ఎక్కడా డిజిటల్ చెల్లింపులను అనుమతించలేదు. నేరుగా నగదు లావాదేవీలే జరిపేవారు. ఇక్కడే అక్రమాలకు పునాదులు పడ్డాయి. మద్యం దుకాణాల కంటే వాటిని తయారు చేసే డిస్టిలరీల్లోనే ఎక్కువ మాయజాలం చేసేవారు. ఒక డిస్టిలరీలో తయారైన మద్యం కేసులన్నీ అధికారికంగా సరఫరా చేస్తే వాటిపై ఎక్సైజ్ డ్యూటీ చెల్లించాలి. కాని వైకాపా హయాంలో లక్ష కేసులు మద్యం తయారైతే అందులో 30 నుంచి 40 శాతం అనధికారికంగా తరలించి అమ్మేసుకునే వారనే ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి ఎలాంటి పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరేవి కావు. నేరుగా అప్పటి ప్రభుత్వ పెద్దల జేబుల్లోకే వెళ్లిపోయేవి. తాజా తనిఖీల్లో ఈ అక్రమాల గుట్టునే వెలికితీస్తున్నారు. డిస్టిలరీ తెప్పించుకున్న ముడిసరకు ఎంత.. వాటితో ఎంత మద్యం తయారుచేశారు.. దుకాణాలకు ఎంత సరఫరా చేశారన్నది నిశితంగా పరిశీలిస్తున్నారు. విశాఖ డిస్టిలరీకి సంబంధించి వైకాపా ముఖ్యనేత కనుసన్నల్లోనే మద్యం ఉత్పత్తి, సరఫరా జరిగింది. ఈ డిస్టిలరీలోనే అక్రమాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందనే అనుమానంతో సీఐడీ బృందం నిశితంగా రికార్డులను పరిశీలించి పలు దస్త్రాలు, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

మంచుఖండంలో అధ్యయనానికి మన్యంవాసి


రమణమూర్తి

హుకుంపేట, న్యూస్‌టుడే: పర్యావరణ అధ్యయనం కోసం మంచుఖండం అంటార్కిటికా వెళ్తున్న భారత శాస్త్రవేత్తల బృందానికి మన్యంవాసి పరదాని రమణమూర్తి నాయకత్వం వహిస్తున్నారు. హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ ఉక్కుర్బా గ్రామానికి చెందిన రమణమూర్తి పేద కుటుంబంలో జన్మించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాస్టర్ డిగ్రీలో బయోఫిజిక్స్ పూర్తిచేశారు. విశాఖపట్నంలోని భారతీయ భూ అయస్కాంత పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం (2024-25) అంటార్కిటికా ఖండానికి భారత శాస్త్రవేత్తల బృందం పర్యావరణంపై అధ్యయనానికి వెళ్తోంది. గిరిజన ప్రాంతంలో పుట్టి శాస్త్రవేత్తగా ఎదిగి భారత శాస్త్రవేత్త బృందానికి నాయకత్వం వహిస్తూ అంటార్కికా ఖండానికి వెళ్లడం గర్వకారణంగా ఉందని ఎంపీ తనూజారాణి అభినందించారు.

రాత్రి బస్సు సర్వీసుల పునరుద్ధరణ



సీలేరు, న్యూస్‌టుడే: సుమారు 45 రోజుల అనంతరం సీలేరు మీదుగా నడిచే రాత్రి బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తూ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. గతనెల 6న భారీ వర్షాలు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు మేరకు వీటిని రద్దు చేశారు. గతనెల 8న భారీవర్షాల కారణంగా గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వరకూ రహదారి, వంతెనలు కొట్టుకుపోవడంతో పూర్తిగా బస్సు సర్వీసులను రద్దుచేశారు. జిల్లా అధికారులు సమష్టి కృషితో మరమ్మతులు చేసి పదిరోజుల్లో రహదారిని బాగుచేశారు. తరవాత కేవలం పగలు బస్సు సర్వీసులను తిరిగి నడపడం మొదలుపెట్టారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవాల నేపథ్యంలో రాత్రి సర్వీసులను పునరుద్ధరించలేదు. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలు సోమవారంతో ముగియడంతో మంగళవారం రాత్రి నుంచి రెండు రాత్రి బస్సు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మన్యానికి హరిత హారం

★ ప్రకృతి విధానంలో కొత్త పంటల సేద్యం

★ ఏడాది పొడవుగా సాగుకు ప్రణాళిక

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యంలో వర్షాధారంగా వ్యవసాయం చేసే గిరిజన రైతులే అధికం. దీంతో ఖరీఫ్‌లో పొలాలన్నీ కళకళలాడుతుంటాయి. అదే రబీ సీజన్ వచ్చేసరికి భూములన్నీ ఖాళీగా ఉండి బీడులా కనిపిస్తుంటాయి. భూములను ఇలా ఖాళీగా వదిలేయకుండా ఏడాది పొడవునా వివిధ రకాల పంటలు సాగు చేసేలా చూడాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. నిరంతర హరితహారం పేరిట ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమం అమలు చేయనుంది. ఇదే సమయంలో మన్యంలో ప్రకృతి సేద్యానికి అత్యంత అనువైన పరిస్థితులు ఉండటంతో దీనిపై స్థానిక రైతుల్లో అవగాహన పెంచడంపైనా వ్యవసాయశాఖ దృష్టి పెట్టింది. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక యంత్రాంగం సాగుదారులను సమాయత్తం చేస్తోంది.


మన్యంలో పండిస్తున్న చిరుధాన్యాలు

సహజంగా ఏటా జూన్ మొదట్లో రుతుపవనాలు వస్తాయి. మైదాన ప్రాంతాలకు భిన్నంగా గిరిజన రైతులు మాత్రం ఎప్పుడు వర్షం పడితే అప్పుడే దుక్కి చేస్తుంటారు. దీంతో మైదాన ప్రాంతం కంటే ముందే ఇక్కడ ఖరీఫ్ సాగు పూర్తవుతుంది. వెంటనే మరో పంట వేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు అధికంగా అభివృద్ధి చెంది భూసారాన్ని పెంచేందుకు దోహదపడతాయి. దీనికి తోడు గిరిజన రైతులు ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, రాగులు.. మిగిలిన సమయంలో రాజ్‌మా వంటి పంటలను మాత్రమే సాగు చేస్తున్నారు. నీటి సదుపాయం ఉన్నచోట పరిమితంగా కొద్ది విస్తీర్ణంలో కాయగూరలను పండిస్తున్నారు. నిరంతర హరిత హారాన్ని అమలు చేయాలంటే మన్యంలో సాగు విధానం పూర్తిగా మారాలి. ముఖ్యంగా బహుళ పంటలను పండించాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖ సరికొత్త కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. చిరుధాన్యాలైన రాగులు, సామలు, కొర్రలు, జొన్నలతోపాటు పప్పు, నూనె జాతి పంటలు, కూరగాయలు, ఉద్యాన పంటలకు సంబంధించి విత్తనాలను రైతులకు అందించి సాగు చేయించేలా కార్యక్రమాలను రూపొందించింది. దీనివల్ల ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తి పెరగడంతోపాటు ఏడాది పొడవునా పచ్చదనం ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



ఫలితాలిస్తున్న పరిశోధనలు: వాతావరణంలో మార్పులు, క్షీణిస్తున్న అడవుల కారణంగా పంట భూముల్లో సేంద్రియ పదార్థాల స్థాయి చాలావరకూ తగ్గిపోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై 2005 నుంచి చింతపల్లి కేంద్రంగా పరిశోధనలు జరుగుతున్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, రాగులు, గోధుమ, ఆవాల పంటలు ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు ఇస్తున్నట్టు గుర్తించాం. విశ్వవిద్యాలయం ఆదేశాలతో 2016 ఖరీఫ్ నుంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పరిశోధనలు కొనసాగిస్తున్నాం. ఖరీఫ్‌లో మొక్కజొన్న, రబీలో రాజ్‌మా సాగుపై పరిశోధనలు కొనసాగుతున్నాయి.

– డాక్టర్ అప్పలస్వామి, ఏడీఆర్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం


ఏడాది పొడవునా గిరిజనులు సాగు చేస్తున్న మొక్కజొన్న

శిక్షణలతో రైతుల్లో అవగాహన: గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు ఎప్పటినుంచో అమల్లో ఉన్నాయి. అధిక దిగుబడుల కోసమని కాలక్రమంలో గిరిజన రైతులూ రసాయనిక ఎరువుల వినియోగాన్ని మొదలుపెట్టారు. ఇప్పుడు మళ్లీవారిని సంప్రదాయ వ్యవసాయ విధానమైన ప్రకృతి సేద్యం వైపు మళ్లించే పనిలో ఉన్నాం. ప్రకృతి సేద్యం ద్వారా పండించే మన్యం పంటలకు మంచి ధరలు పలుకుతున్నాయి. దీంతో రైతులు ప్రకృతి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. హరిత హారం కోసం జిల్లావ్యాప్తంగా పలు క్లస్టర్లను ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో మిగిలిన గ్రామాల్లోనూ రైతులంతా ప్రకృతి సేద్యమే ఆచరించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.



– భాస్కరరావు, జిల్లామేనేజరు ప్రకృతి వ్యవసాయ విభాగం

కుమ్మరి చక్రం గిరగిరా!

చక్రజీవకుల కుటుంబాల్లో దీపావళి | చుంచు బుడ్లు, ప్రమిదల తయారీతో ఉపాధి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే

మట్టి కుండల తయారీని ఉపాధిగా మలచుకుని జీవనం సాగిస్తున్న కుమ్మరి కుటుంబాల్లో దీపావళి వెలుగులు తెచ్చింది. వినాయక చవితి మొదలు దివ్వెల పండగ వరకు ఇంటిల్లిపాదికీ చేతినిండా పని ఉంటోంది. డిమాండు అధికంగా ఉంటే అదనంగా పని వారిని ఏర్పాటు చేసుకుంటుంటారు. మిగతా రోజుల్లో కుండలు, పిడతలు చేస్తుంటారు. ఏ పనీ లేకుంటే ఇటుక బట్టీల్లో పనులకు వెళ్తుంటారు.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో సుమారు 400 కుటుంబాలు ఈ వృత్తిలో ఉన్నాయి. ఏటా వినాయక చవితికి గణనాథుని మట్టి ప్రతిమలు, దీపావళికి చుంచుబుడ్లు, ప్రమిదల తయారీలో నిమగ్నమవుతుంటారు. మూడు నెలలపాటు కుటుంబమంతా చెమటోడిస్తే ఏడాదికి సరిపడా ఆదాయం వస్తోంది. మిగతా తొమ్మిది నెలల్లో చేతినిండా పనిలేకున్నా.. కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించుకుంటున్నారు.

40 కుటుంబాలు.. 130 మంది

చోడవరం పట్టణ శివారు ఫకీర్‌సాహెబ్‌పేట (పీఎస్‌పేట) కుమ్మరి వీధిలో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరి జనాభా 130 మంది వరకు ఉంది. వీరంతా ప్రతి సంవత్సరం మట్టితో వినాయకుడి ప్రతిమలు తయారు చేసి విక్రయిస్తున్నారు. చిన్న సైజ్ నుంచి మూడు అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను చేస్తున్నారు. చిన్న బొమ్మలు ఒక్కొక్కటి రూ.8 చొప్పున, మూడు అడుగుల బొమ్మలను గరిష్ఠంగా రూ.800 చొప్పున విక్రయిస్తున్నారు. దాతల్లో కొందరు ముందుగా ఆర్డరు ఇచ్చి పండగకు రెండు రోజుల ముందు మట్టి ప్రతిమలను ఉచితంగా పంచుతున్నారు.



రెండు నెలలుగా నిర్విరామంగా..

దీపావళి సందర్భంగా రెండు నెలల ముందు నుంచే చుంచుబుడ్లు, ప్రమిదల తయారీలో నిమగ్నమయ్యారు. వీటి తయారీకి జింకమట్టి, ఇసుక, కొబ్బరి పీచు, చెరకు కట్టును ముడి సరకుగా వినియోగిస్తున్నారు. మిగతా రోజుల్లో నీటి కుండలు, పిడతలు, బొగ్గుల పొయ్యిలు, కర్రల పొయ్యిలు తయారు చేస్తుంటామని చక్రజీవకులు చెబుతున్నారు. వీటిని చోడవరం పరిసర ప్రాంతాలతో పాటు అనకాపల్లి, వడ్డాది, బుచ్చెయ్యపేట, మాడుగుల, సత్యవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, పాడేరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి దుకాణాల్లో విక్రయిస్తుంటారు. చుంచుబుడ్డి రూ.3, వంద ప్రమిదెలు రూ.80 చొప్పున కొనుగులు చేసే వ్యాపారులు వినియోగదారులకు రూ.5, రూ. వందకు విక్రయిస్తున్నారు.



ఇదే జీవనాధారం

మా కుటుంబాలకు ఇదే జీవనాధారం. తాతముత్తాతల నుంచి వారసత్వంగా వస్తోంది. రెండు నెలలు కష్టపడి పనిచేస్తే కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. - పొట్నూరు నాగమణి

బ్యాంకు రుణాలు ఇప్పించాలి

చక్రజీవకులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో మా సంక్షేమానికి ఏమీ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకంలో కొందరికి యంత్రాలను పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆశతో ఉన్నాం. బ్యాంకు రుణాలతోపాటు రాయితీపై యంత్రాలను అందిస్తే ఆర్థికంగా మరింత నిలదొక్కుకుంటాం. - గోవిందరావు, చోడవరం



పనులకు వెళ్తుంటాం..: మూడు నెలల కిందటి వరకు కర్రతో చక్రం తిప్పుతూ చుంచుబుడ్లు, ప్రమిదలు తయారు చేసే వాళ్లం. కేంద్ర ప్రభుత్వం యంత్రాలను అందించడంతో ఇప్పుడు వాటిపై తయారు చేస్తున్నాం. సాధారణ రోజుల్లో కూలీ పనులకు వెళ్తుంటాం. - అనకాపల్లి సుబ్బలక్ష్మి



గంజాయి రవాణాపై గట్టి నిఘా

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నంలోని అయ్యన్న కాలనీ కూడలి... ఓ మహిళ సహా ముగ్గురు మంగళవారం ఉదయం ఎవరికో సమో ఎదురుచూస్తున్నారు. అటుగా వెళుతున్న పోలీసులకు అనుమానం వచ్చి వారి సంచులను తనిఖీ చేస్తే పదికేజీల గంజాయి పట్టుబడింది.

ఇదొక్కటే కాదు.. నర్సీపట్నంలో తరచూ గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఏజెన్సీ నుంచి పట్టణం మీదుగానే రాష్ట్రాలు దాటిస్తుంటారు. ఎన్నికలు ముగిసిన అనంతరం పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తయి ఇప్పుడు పాలన గాడిలో పడింది. ప్రభుత్వ ప్రాధాన్యానికి అనుగుణంగా ఎస్పీ నుంచి సీఐ వరకు గంజాయి నేరగాళ్లను కట్టడి చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగుతున్నారు. సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సైతం ఈ విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



గంజాయి మత్తులో పాతికేళ్ల యువకుడు ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఏడాదిన్నర క్రితం స్థానిక ఎస్సీ కాలనీలో చోటు చేసుకోవడం తెలిసిందే. ఈ మత్తుకు బానిసలైన యువకులు తరచూ కొట్లాటలకు దిగుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. గూడెంకొత్తవీధి, చింతపల్లి ప్రాంతాల్లో కేజీ రూ.2 వేల నుంచి రూ. 3 వేలకు కొనుగోలు చేసి స్థానికంగా గ్రాముల లెక్కన పొట్లాల్లో విక్రయిస్తున్నారు. ఓ వ్యక్తి పదిగ్రాముల గంజాయి పొట్లాన్ని రూ. 100కి విక్రయించడం గమనించి బీసీ కాలనీకి చెందిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడాది క్రితం నలుగురు యువకులు, ఓ మహిళ రెండు కిలోల సరకుతో పట్టుబడ్డారు. వీరికి విజయవాడలో గ్యాంగ్ వార్‌లు, వ్యభిచార నేరాలతో సంబంధాలు ఉన్నట్టు పోలీసుల దృష్టికి వచ్చింది. విశాఖపట్నంలో ఇటీవల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ఇలాంటివి ఇక్కడా గుట్టుగా విక్రయిస్తూ ఉండొచ్చన్న కోణంలో నిఘా కట్టుదిట్టం చేయనున్నారు. గంజాయిని ద్రవ రూపం పొట్లాలుగా, ఆయిల్‌గా మార్చి ఎగుమతి చేస్తుండటాన్ని గతంలో ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. లీటరు ద్రవం రూ. లక్ష వరకు విక్రయిస్తున్నారు.



నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన ఇలాంటి వాహనాలెన్నో



గంజాయి రవాణా నిరోధిస్తాం: నర్సీపట్నం మీదుగా గంజాయి రవాణా నిరోధించేందుకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేస్తాం. జాగిలాల ద్వారా తనిఖీలు ముమ్మరం చేస్తాం. బస్సులు, బైకులు ఇలా అన్ని వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తుంటాం. ఈ వ్యాపారంలో ఎవరెవరు ఉన్నారో ఆరా తీస్తున్నాం. వారిపై నిఘా ఉంచుతాం. ఈ మత్తుకు యువత ఎక్కువగా బానిసవుతోంది. గంజాయి గురించి ఎలాంటి సమాచారం తెలిసినా సామాజిక బాధ్యతగా పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చే వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతాం. - జి.గోవిందరావు, నర్సీపట్నం సీఐ

ఎలక్ట్రిక్ స్కూటర్లకు వినియోగదారుల ఆదరణ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: తామరం పెట్రోల్ బంకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతక్ షోరూమ్‌ను డివిజన్ రీజనల్ మేనేజర్ ఎస్. దీపక్, ఏరియా మేనేజర్ అరుణ్‌కుమార్ వెంకటేశన్ మంగళవారం ప్రారంభించారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. వరుణ్ బజాజ్ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాహనాలు కొనుగోలు చేసిన వారితో సిబ్బంది

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వెళ్తున్న కారు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట మంగళవారం రాత్రి డివైడర్‌ను ఢీకొంది. సకాలంలో ఎయిర్ బ్యాగులు తెరచుకోవడంతో కారులో ఉన్న వారంతా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

నర్సీపట్నం: కారాగారాల్లో ఖైదీలకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని ర్సీపట్నం కోర్టు సీనియరు డివిజన్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ జైలు అధికారులను ఆదేశించారు. స్థానిక ఉప కారాగారాన్ని మంగళవారం సందర్శించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేసి ఆహార పదార్థాలను రుచి చూశారు. వారానికి రెండుసార్లు న్యాయసేవాధికార సంస్థ నియమించిన న్యాయవాది ఎం.గోవర్ధన్‌కి జైలును సందర్శిస్తారన్నారు. జైలు పర్యవేక్షణాధికారి సన్యాసిరావు వెంట ఉన్నారు.

వాగు పొంగి రాకపోకలకు అంతరాయం

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం - రంపచోడవరం జాతీయ రహదారి మళ్లింపు మార్గంపై మంగళవారం మధ్యాహ్నం కొండవాగు పొంగి ప్రవహించింది. దీంతో గంగవరం, రంపచోడవరం మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఆరు గంటల వరకు వాగు ఉద్ధృతి తగ్గకపోవడంతో ఇరువైపులా ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. రంపచోడవరం, మారేడుమిల్లి, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు గోకవరం మీదుగా వెళ్లగా, కుసుమరాయి, బి.వెలమకోట, నెల్లిగొంది, ఎర్రంపేట గ్రామాలకు వెళ్లాల్సిన గిరిజనులు ఆటోలు, ద్విచక్ర వాహనాలు వాగు ప్రవాహం తగ్గేవరకు వేచి ఉండి వెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ రాంబాబు వాగు వద్ద పహారా కాశారు. జాతీయ రహదారి నిర్మాణ అధికారులు వాగు వద్ద కొద్దిసేపు వేచి ఉండి వెళ్లిపోయారు. వంతెనను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులు, స్థానికుల ఇబ్బందులు తొలగించాలని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, జనసేన మండలాధ్యక్షుడు కుంజం సిద్దు, స్థానిక సర్పంచి కలుముల అక్కమ్మ కోరారు.



గంగవరం శివారులో జాతీయ రహదారి డైవర్షన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు

ఆహ్లాదకరంగా పీనరి అందాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సినిమా చిత్రీకరణకు వేదికగా, పర్యాటకుల మదిని ఆకట్టుకుంటున్న పీనరి అందాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం అభినందనీయమని పాడేరు డివిజన్ అటవీ అధికారి వెంకట సందీప్‌రెడ్డి అన్నారు. అంజోడ సిల్క్‌ఫాం పీనరిని మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడ మొక్కలు నాటారు. అటవీ శాఖ ద్వారా ఎకో టూరిజంతో పర్యాటక కేంద్రాలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పీనరిని తీర్చిదిద్దడంలో అటవీ వన సంరక్షణ సమితి భాగస్వామ్యం అభినందనీయమని తెలిపారు. సబ్ డీఎఫ్‌ఓ ఉమామహేశ్వరి, రేంజ్ అధికారి శ్రీనివాసరావు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంజోడ సిల్క్‌ఫాం పీనరిలో మొక్క నాటుతున్న డీఎఫ్‌ఓ వెంకట సందీప్‌రెడ్డి

తెదేపా బలోపేతానికి సమష్టి కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో లక్ష్యం మేరకు పార్టీ సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పిలుపునిచ్చారు. రంపచోడవరంలో మంగళవారం ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా తెదేపా నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 26 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభం కానుందని చెప్పారు. పార్టీ బలోపేతం చేసేలా అందరూ కృషి చేయాలని కోరారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో డిగ్రీ పూర్తిచేసిన వారి ఓటు నమోదు చేయించే బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పార్టీ అధిష్ఠానం బరిలో నిలిపే అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు మరం విజయభాస్కర్, ఎస్టీ సెల్ రంపచోడవరం నియోజకవర్గ కన్వీనర్ బాచినేని శ్రీకాంత్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కారం సురేష్, మరిచెట్ల వెంకటేశ్వరరావు, పాము అర్జున్, పల్లాల వెంకటరమణారెడ్డి, తీగల ప్రభ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రహదారి పనులు అడ్డుకునే వారిపై ఫిర్యాదు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లంగుపర్తి పరిధిలోని ఎగువ పట్టి, దిగువ పట్టి, ఎగవ పాడు, మరో అయిదు గ్రామాలకు వెళ్లే రహదారి పనులు నిలిపివేయాలంటూ రహదారిపై పొక్లెయిన్‌తో పెద్ద బండరాళ్లను రహదారి మధ్యలో వేశారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు ఆయా ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం లంగుపర్తి పంచాయతీలోని గ్రామాల ప్రజలతో మాట్లాడారు. సర్పంచి జన్ని సన్యాసిరావు మాట్లాడుతూ అయిదు గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించే రహదారిని అడ్డుకునేందుకు లంగుపర్తి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రహదారిలో రెండు చోట బండరాళ్లు వేసి వాహనాలను అడ్డగించారని ఆరోపించారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించే వారిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. పుట్టబోయిన తమ్మన్న, బడ్నాయిన చంటిబాబు పాల్గొన్నారు.



లంగుపర్తి రహదారిలో స్థానికులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

తాగునీటి పథకాల పనులు వేగవంతం

పాడేరు: జల్ జీవన్ మిషన్ పథకంలో మంజూరైన తాగునీటి పథకాలను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం సాయంత్రం 22 మండలాల్లోని వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాలను విధిగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అన్నారు. మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని ఎంఈఓలకు సూచించారు. ఇంటింటికి వెళ్లి స్కిల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎంత మంది దివ్యాంగులు ఉన్నారో గుర్తించి సదరం క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ జవహర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో గిరిజనులను ఇబ్బంది పెడితే చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: జనన, మరణ ధ్రువపత్రాలు జారీకి నోటరీ చేయాలని ఇబ్బందులు పెడితే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. రెవెన్యూ పరంగా జారీచేసే ధ్రువపత్రాలకు అఫిడవిట్లతో పనిలేదన్నారు. అఫిడవిట్లు అడిగితే తీవ్రంగా పరిగణించి సబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని 4110 గ్రామాల్లో 2.71లక్షల కుటుంబాలను సర్వే చేయగా 16 వేల మందికి ఆధార్ కార్డులు లేవని తేలిందని వీరందరికీ ఆధార్ కార్డులు జారీ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూముల సర్వే సక్రమంగా చేయకపోతే వీఆర్వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 86 నీటి సంఘాలకు నవంబరు 21 ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.

✦ జిల్లాలో పెద్ద ఎత్తున వయోజన అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం అమలుపై ఆయన కార్యాలయంలో ఐసీడీఎస్, వయోజన విద్య, పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్షరాస్యత పెంపునకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్‌ఓ పద్మావతి, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, సర్వే అధికారులు ,22 మండలాల తహసీల్దార్లు,.వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్ సుబ్రహ్మణ్యం వర్మ, సహాయ సంచాకుడు డి. చిన్నికృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డీఆర్‌డీఏ పీడీ మురళి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్,చిత్రంలో జేసీ తదితరులు

రావణాపల్లిలో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లు



పనులు ప్రారంభిస్తున్న జీసీసీ మాజీ ఛైర్మన్ ప్రసాద్

కొయ్యూరు, న్యూస్‌టుడే: రావణపల్లి పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు జీసీసీ మాజీ ఛైర్మన్, తెదేపా నేత ఎంవీవీ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో రావణాపల్లి పంచాయతీలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. సర్పంచి కాకూరు లక్ష్మి, తెదేపా నేత కాకూరు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఇళ్ల నిర్మాణానికి నిధుల పెంపునకు వినతి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీలకు పీఎం జన్‌మన్ పథకంలో కేటాయిస్తున్న ఇళ్ల నిర్మాణ వ్యయం రూ. అయిదు లక్షలకు పెంచాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. అరకులోయ మండలం బొండాం పంచాయతీ రేగలో పంచాయతీ నాయకులు బుజ్జిబాబుతో కలసి పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ వ్యయం ఇసుక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని, ఇళ్లు మంజూరైన తక్షణం అడ్వాన్సుగా రూ.70వేలు చెల్లించాలన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలదేవ్

వసతిగృహాల్లో తనిఖీలు

బుచ్చెయ్యపేట: మండలంలోని సంక్షేమ వసతి గృహాలను చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రనాథ్‌బాబు తనిఖీ చేశారు. సమస్యలను పరిశీలించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 30 మంది తరలింపు

కొయ్యూరు: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాజేంద్రపాలెం వైద్యాధికారి సంపత్‌బాబు అన్నారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగావివిధ గ్రామాల నుంచి వచ్చిన 100 మందిని కంటి వైద్య సహాయకుడు ఎన్వీ రమణ పరీక్షించారు. శస్త్రచికిత్సలు అవసరమైన 30 మందిని ప్రత్యేక బస్సులో విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. సీహెచ్‌వో ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి సంపత్‌బాబు

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాల వృద్ధికి అధ్యాపకులు కృషిచేయాలని కళాశాల విద్య ప్రాంతీయ ఉప సంచాలకురాలు శోభారాణి అన్నారు. అరకులోయ వచ్చిన ఆమె డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల్ని మంగళవారం సందర్శించారు. మహిళా డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బోధనాంశాల ప్రగతిపై చర్చించారు. డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ భరత్ కుమార్‌నాయక్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ శోభారాణి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సీలేరు, న్యూస్‌టుడే: ఆంధ్రా - ఒడిశా సరిహద్దుల్లో సీలేరు సమీపంలోని రాజులకొండ వద్ద కారు ప్రమాదం సంఘటనలో గూడెం కొత్తవీధి మండలానికి చెందిన ఒకరు మృతి చెందగా, గాయపడిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చిత్రకొండ పోలీసులు తెలిపారు. మండలంలోని ముర్లగెడ్డ గ్రామానికి చెందిన కిల్లో ప్రకాష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఒడిశా వెళ్లేందుకు మంగళవారం ఉదయం బయలుదేరారు. సరిహద్దుల్లోని కాట్రగెడ్డకు సమీపాన రాజులకొండ వద్దకు వచ్చేసరికి కారు అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కిల్లో రసో (23) సంఘటన స్థలంలోనే మరణించగా, కారులో ప్రయాణిస్తున్న మిగిలిన వారు గాయపడ్డారు. గాయపడిన వారిలో ప్రకాష్ కుమారులు కిల్లో శ్రీను, కిల్లో రాముడు, కుమార్తె ఎలిషా బేతూ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వీరికి చికిత్స చేస్తున్న చిత్రకొండ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.



రాజులకొండ వద్ద ప్రమాదానికి గురైన కారు

ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో మంగళవారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు గోరంట్ల రవిరామ్ కిరణ్ రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కందుల సాయిబాబాబు, మాజీ సర్పంచి చవలం బాపన్నదొర, పెద్దలు కంగల అబ్బాయిదొర, మీరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ రవిరామ్‌కిరణ్

బీమా పథకాల సద్వినియోగంతో లబ్ధి

పాడేరు, న్యూస్‌టుడే: పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో జన సురక్ష కార్యక్రమం ప్రచార గోడపత్రులు కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మధునాయుడు, డీఆర్‌డీఏ పీడీ మురళి, నాబార్డ్ డీడీఎం చక్రధరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లిలో ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, ప్రధాన మంత్రి సురక్షా బీమా పథకాలపై స్థానిక గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ జి.సతీష్‌కుమార్ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకంలో ఏడాది రూ. 436 చెల్లిస్తే, అటువంటి వ్యక్తి సాధారణంగా మరణిస్తే వారి కుటుంబానికి రూ. రెండు లక్షల బీమా సాయం వస్తుందన్నారు. 18 నుంచి 70 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.20 చెల్లించి ప్రధాన మంత్రి సురక్షా యోజనలో చేరితే ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే.. మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ. రెండు లక్షలు చెల్లిస్తామన్నారు. బ్యాంకు ద్వారా అందించే ఈ బీమా పథకాల్లో చేరాలని కోరారు. స్థానిక సీఎస్‌పీ కె.లక్ష్మణరావు, బ్యాంకు సిబ్బంది తులసి, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.



బీమా పథకాల గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ మధునాయుడు

మరదలిపై బావ అత్యాచారం

ఎలమంచిలి: పురుడు పోసుకున్న అక్కకు సాయపడేందుకు వచ్చిన చెల్లిపై బావ అత్యాచారం చేసిన ఘటన ఎలమంచిలిలో చోటుచేసుకుంది. ఎస్సై సావిత్రి కథనం ప్రకారం.. ధర్మవరం ప్రాంతంలో ఓ మహిళకు కొద్ది నెలల కిందట ప్రసవమైంది. 16 ఏళ్ల తన చెల్లిని ఇంటికి సాయానికి తెచ్చుకుంది. ఈమె భర్త కొద్ది నెలలుగా ఆ బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. దీనిపై బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

ఆదమరిస్తే... ప్రమాదమే



చోటాముఖిపుట్టు సమీపంలో గుంతలతో ఉన్న రోడ్డు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. బాపనపుట్టు నుంచి వనబసింగి వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలు వాన కురిస్తే వరద నీటితో నిండిపోతున్నాయి. రోడ్డుపై కంకర రాళ్లు తేలి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చోటాముఖిపుట్టు గ్రామ సమీపాన వంతెనకు ఆనుకుని రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వరద నీరు గుంతల్లో చేరి, కంకర రాళ్లు రోడ్డుపై విస్తరించి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బాపనపుట్టు సమీపంలో కల్వర్టు వద్ద రోడ్డు ఛిద్రమైంది. వనబసింగి సమీపాన రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు వాహన చోదకుల కంటికి కనిపించకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. పాడేరు నుంచి జోలాపుట్టు వరకు ఉన్న ప్రధాన రహదారిలో గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల పరిధిలో ఈనెల 24న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ అప్పారావు తెలిపారు. కొంతమంది వ్యక్తులు విద్యుత్తు స్తంభాల వద్ద పిచ్చి మొక్కలు తొలగించడం, విద్యుత్తు సరఫరా లేదని తీగలను పట్టుకోవడం లాంటివి చేస్తున్నారని.. ఇలాంటివి ప్రాణాంతకమని తెలిపారు.

నిర్వహణ కొరవడి.. శిథిలస్థితికి చేరి

జడ్పీ అతిథిగృహం దుస్థితి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

మారేడుమిల్లిలో దశాబ్దాల క్రితమే జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో అతిథిగృహాన్ని నిర్మించారు. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఇక్కడే వసతి సదుపాయం కల్పించేవారు. దీని నిర్వహణలకు ప్రత్యేకంగా సిబ్బంది కూడా ఉండేవారు. క్రమేపీ దీని నిర్వహణపై జిల్లా పరిషత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పర్యవేక్షణ కొరవడింది. క్రమంగా శిథిలస్థితికి చేరింది.

అసాంఘిక కార్యకలాపాలకు 'అడ్డా'

అతిథిగృహం ప్రస్తుతం పూర్తిగా శిథిలస్థితికి చేరడంతో ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు 'అడ్డా'గా మారింది. దీని చుట్టూ ప్రైవేటు వ్యక్తులు పక్కా నిర్మాణాలను చేపట్టడంతో మూసేసినట్లుగా మారిపోయింది. లోపలికి వెళ్లడానికి గేటు మాత్రం మిగలడంతో వాహనాలను నిలపడానికి పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకుంటున్నారు. అటు పక్కకు వెళ్లడానికి కూడా ఆస్కారం లేకుండా పోయింది. దీంతో మద్యం తాగడం, పేకాట ఆడడంతోపాటు, గంజాయిని తాగేవాళ్లకు అడ్డాగా మారిపోయింది. స్థానికులు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు.



భవనం దుస్థితి

పరిసరాల్లో ఆక్రమణలు..

మారేడుమిల్లిలోని ప్రధాన కూడలిలో ఉన్న దీని చుట్టూ ఉన్న స్థలాలు క్రమంగా ఆక్రమణదారుల పరం అవుతున్నాయి. లక్షలాది రూపాయల విలువైన స్థలాల్లో ఆక్రమణదారులు పక్కా నిర్మాణాలను (దుకాణాలు) కట్టేసి, వాటిని అద్దెలకు ఇస్తున్నారు. వీరికి. రాజకీయ నాయకుల అండ పుష్కలంగా ఉండటంతో మండలస్థాయి అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒకవేళ అధికారుల దృష్టికి ఎవరైనా తీసుకువెళ్లినా, మనకెందుకు వచ్చిన గొడవ అంటూ వారు మిన్నకుంటున్నారు.

ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా..!

మారేడుమిల్లి ప్రాంతం పర్యాటకంగా విశేషంగా అభివృద్ధి చెందింది. నిత్యం వందలాది మంది పర్యాటకులు ఇక్కడికి తరలి రావడం రోజుల తరబడి ఇక్కడే ఉంటుంటారు. వీరికి వసతి సదుపాయం కల్పించే లక్ష్యంతో కుప్పలుతెప్పలుగా కాటేజీలు, రిసార్టులు, అతిథిగృహాలు నిర్మాణం జరిగిపోతోంది. ఎక్కడ పడితే అక్కడ వీటిని నిర్మించడంతో ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా అడ్డూఅదుపూ లేకుండా పర్యాటకుల నుంచి డబ్బులను వసూలు చేస్తూ, దోపిడీకి పాల్పడుతున్నారు. వారాంతాల్లో అయితే ఇక వీరి దోపిడీకి అంతే లేకుండా పోతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆధీనంలోని ఇటువంటి అతిథిగృహాలను అభివృద్ధి చేసి, పర్యాటకులకు వసతి కల్పించడానికి అందుబాటులోకి తీసుకువస్తే ఆదాయం కూడా సమకూరుతుంది. ఈ దిశగా దృష్టిని సారించకపోవడం విచారకరం.

గుడి, బడి దగ్గరలో మద్యం దుకాణమా..



తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: గుడి, వైద్యశాల, మహిళలు ఎక్కువగా ఉండేచోట మద్యం దుకాణం ఎలా పెట్టారని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ దుకాణం నిర్వాహకులను ప్రశ్నించారు. రేఖపల్లిలో కొత్తగా పెట్టిన మద్యం దుకాణం ఎదుట మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో అక్కడి వీధి మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. రెవెన్యూ కార్యాలయం ఎదుట మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ సరస్వతికి సమస్య తీవ్రతను వివరించి, వినతిపత్రం అందించారు. రేఖపల్లి సర్పంచి సరోజిని, స్థానిక మహిళలు గంగాభవానీ, సావిత్రి, గాయిత్రి, లక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా సమావేశం రేపు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: స్థానిక కిడారి భవన్‌లో గురువారం తెదేపా మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తుడుము సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ పథకాలతోపాటు 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న సభ్యత్వ నమోదు విజయవంతం అయ్యేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. సమావేశానికి అరకులోయ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి దొన్నుదొర హాజరవుతారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు హాజరు కావాలని ఆయన కోరారు.

25 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల, రాజేంద్రపాలెం, మంప, రేవళ్లు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ పరిపాలనాధికారి బాలమురళీ కృష్ణ తెలిపారు. పాత ఆధార్ కార్డులను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. 18ఏళ్ల వయసు నిండిన వారు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. మండలంలోని ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మండలంలోని కె.కోడాపల్లి, సోలభం, నుర్మతి పంచాయతీ కేంద్రాల్లో ఆధార్ సేవలను అధికారులు ప్రారంభించారు. కె.కోడాపల్లిలో మండల పరిషత్ ఏవో డేవిడ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ అప్‌డేట్, ఫోన్ నెంబర్ లింక్, చిరునామా మార్పులు, చేర్పులు చేసుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ నాగమ్మను కార్యాలయ సిబ్బంది మంగళవారం సన్మానించారు. గిరిజన ప్రాంతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ హరి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వారానే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చింతపల్లి సీఐ రమేశ్ అన్నారు. చింతపల్లి ఎస్సైగా పనిచేసిన అరుణ్ కిరణ్‌కు అల్లూరి జిల్లా ఎస్‌బీ విభాగానికి బదిలీ అయ్యింది. ఇతన్ని మంగళవారం స్టేషన్ సిబ్బంది, సీఐ రమేశ్ సత్కరించి వీడ్కోలు పలికారు.

గిరి విద్యార్థికి సత్కారం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన గిరిజన విద్యార్థి శెట్టి లోహిత్‌ను వైకాపా సీనియర్ నాయకుడు సురేష్‌కుమార్ సత్కారించారు. ఈనెల 4, 5, 6న రాజమహేంద్రవరం, గుంటూరులలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో లోహిత్ బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భువనేశ్వర్‌లో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభను కనబర్చి మన్యానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల, కళాశాల స్థాయిలోని పరుగు పందెంలో పతకాలు సాధిస్తున్న గిరిజన విద్యార్థికి ఐటీడీఏ సహకారం అందించాలని ఆయన కోరారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కొరత

ఎటపాక, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి ఐసంపల్లి వెంకటేశ్వర్లు (ఐవీ) మంగళవారం డిమాండ్ చేశారు. ఈ కేంద్రాల్లో ఎరువుల కొరత ఉండటంతో బయట దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ ఎరువుల దుకాణం ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

అమ్మవారికి మారు మంగళవారం పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం జెన్‌కో ప్రాజెక్టు పరిధిలోని పొల్లూరు మాతృశ్రీ ధారాలమ్మ జాతర ఈ నెల 15వ తేదీన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. మారు మంగళవారం పూజలను ఆలయ అర్చకస్వామి కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో ఈ మంగళవారం నిర్వహించారు.

పొలాల్లో తీగలు అమరిస్తే చర్యలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: పంట పొలాల్లో విద్యుత్తు తీగలు అమరిస్తే కఠిన చర్యలు తప్పవని మంప ఎస్సై శంకరరావు హెచ్చరించారు. మంప గ్రామంలోని ప్రజలతో మంగళవారం ఎస్సై సమావేశమయ్యారు. జంతువుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి విద్యుత్తు తీగలు ఏర్పాటు చేస్తే ఇటు గిరిజనులు, అటు జంతువులు మృతిచెందే ప్రమాదం ఉందన్నారు.



మాట్లాడుతున్న మంప ఎస్సై శంకరరావు

ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు

చింతూరు, న్యూస్‌టుడే: ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన యోధుడు కుమురం భీం అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్న మాణిక్యం పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా మంగళవారం కళాశాలలో వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా గెరిల్లా పద్ధతిలో కుమురం భీం పోరాడారని వివరించారు. అధ్యాపకులు మల్లి శేఖర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. చింతూరు ఐటీడీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: ఐక్య పోరాటాలతో కుమురం భీం ఆశయాలను సాధిద్దామని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కోతులగుట్టలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆదివాసీ జేఏసీ కన్వీనర్ కుంజా అనిల్ మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయకపోవడంతో మన్యంలోని ఆదివాసీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సున్నం వెంకట రమణ, సోడి ముత్యయ్య, జోగయ్య, రవితేజ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆధ్వర్యంలో పోతవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఆదివాసీల స్వయంపాలన రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కొమరంభీంకు నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



సీలేరులో...

సీలేరు కుమురం భీం సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో...

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో కుమురం భీం జయంతి వేడుకలు సీలేరు కుమురం భీం సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ చీఫ్ ప్రమోటర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ ఆదివాసీల సొంతమని, స్వయం పాలన ఆదివాసీల జన్మహక్కు అన్నారు. సొసైటీ గౌరవ సభ్యుడు కోడ ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన కుమురం భీం అడుగుజాడల్లో అందరూ నడవాలని చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి అన్నారు. కళాశాలలో మంగళవారం కుమురం భీమ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని వివరించారు. భీం ఆశయసాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు రమణ, లీలాపావని, కేజియా, జగత్‌రాయ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ఎమ్మెల్యే శిరీషాదేవికి దివ్యాంగుల సమస్యలను తెలియజేస్తున్న బృందావనం మండల సమాఖ్య సభ్యులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బృందావనం మండల సమాఖ్య సభ్యులు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని కోరారు. సమాఖ్య అధ్యక్షురాలు జంగ విజయలక్ష్మి, కార్యదర్శి ఎంపీపీ సత్యనారాయణ, సుందం జగ్గారావు తదితరులు స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు విన్నవించారు. ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకొనేందుకు భవనం ఏర్పాటు చేయాలని, గిరిజన, గిరిజనేతర అనే భేదం లేకుండా దివ్యాంగులకు అన్ని సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. ఎమ్మెల్యేను సన్మానించారు.

పనసలొద్ది గోడు పట్టించుకోరూ...

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం పనసలొద్ది గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో ఈ గ్రామంలో అనేక సమస్యలు అలాగే ఉన్నాయని జనసేన అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక సభ్యుడు గొర్లె వీరవెంకట్ అన్నారు. ఈ గ్రామంలో మంగళవారం జనసేన నాయకులు పర్యటించారు. స్థానికులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. వైకాపా ఒక్కటిన గెలిపించినా అభివృద్ధి చేయలేదన్నారు. గ్రామంలో రహదారి, తాగునీరు, మురుగుకాలువ, అంగన్‌వాడీ భవన నిర్మాణం వైకాపా ప్రభుత్వానికి పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జనసేన నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొయ్యం సిద్దు, మండల యువత అధ్యక్షుడు పాంగి చంటిబాబు, కన్వీనర్ గడుతూరి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకులుకు సమస్యలు చెబుతున్న పనసలొద్ది గిరిజనులు

కూలిన ప్రహరీ నిర్మించరా..

హుకుంపేట, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక కళాశాల బాలికల వసతి గృహంలో కూలిన గోడను మంగళవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో కళాశాల బాలికల వసతి గృహం ప్రహరీ గత ఏడాది కురిసిన వర్షానికి కూలిందని అప్పటి ఏటీడబ్ల్యూవో రజని వారం రోజుల్లో ప్రహరీ కట్టిస్తానని చెప్పి నేటికి ఏడాది దాటిందని పేర్కొన్నారు. బాలికలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారోనని పేర్కొన్నారు.



హుకుంపేట కళాశాల వసతి గృహంలో కూలిన గోడను చూపిస్తున్న గిరిజన సంఘ నాయకులు

గిరిజన ప్రాంతం అభివృద్ధికి కట్టుబడాలి

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో ప్రతి ఒక్క ఆదివాసీ కుటుంబానికి పీఎం జన్‌మన్ కింద ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు చొప్పున చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని వనుగుమ్మలో మంగళవారం సీపీఎం మహాసభ నిర్వహించారు. తొలుత పార్టీ జెండా అవిష్కరించి సీతారాం ఏచూరి చిత్రపటాన్ని పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం త్రినాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో గిరిజన ప్రాంతంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు రహదారులు, ఇల్లు, తాగునీరు, చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు మూడును అమలుచేయాలని వారంతా కోరారు. సీపీఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, కార్యదర్శి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ చింతపల్లిని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్థులు సహకరించాలని ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. స్థానిక సర్పంచి దురియా పుష్పలత ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికీ చెత్తబుట్టలు పంపిణీ చేశారు. పంచాయతీకి 4 వేల చెత్తబుట్టలు మంజూరయ్యాయని, ప్రతి ఇంటికీ రెండు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. తడి-పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చేందుకు వీటిని ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, ధారలక్ష్మి, కూటమి నాయకులు ఆనంద్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

కలెక్టర్ దృష్టికి పాఠశాల సమస్యలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. కిల్లోగుడ ఆంగ్ల మాధ్యమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం మెనూతోపాటు తరగతి గదులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికతోపాటు రోజువారీ ఉపాధ్యాయుల విధులపై ఆరా తీశారు. విద్యార్థినుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. చాలీచాలని గదులతో ఇబ్బందులు పడుతుండటంపై పరిశీలించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. మెనూలో నిర్లక్ష్యం చేస్తే సహించమని హెచ్చరించారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచి శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, నాయకులు సింహాచలం, కృష్ణారావు, నాగేశ్వరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



కిల్లోగుడ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులకు 'టీచింగ్ ఎట్ రైట్ లెవెల్' శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏజెన్సీ డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మండలాల నుంచి ఒక్కో మండలంలో నలుగురు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఈ శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ రాకేష్, వెంకన్న, జిల్లా సమన్వయకర్త సతీష్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఎంఈవో రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

'స్వచ్ఛ అరకులోయ'కు సహకరించండి

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రాఊటీ అరకులోయని స్వచ్ఛ అరకులోయగా మార్చేందుకు వీలుగా ఇంటింటికీ చెత్త బుట్టలను ఉచితంగా అందిస్తున్నట్లు పెదలబుడు సర్పంచి పెట్టెలి దాసుబాబు అన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తబుట్టలు ఇంటింటికీ అందించే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రెండేసి చెత్త బుట్టలు ఇస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తని వేర్వేరుగా భద్రపరిచి ఇంటికి వచ్చే చెత్త వాహనంలో వేయాలని ఆయన కోరారు.



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న సర్పంచి దాసుబాబు, సిబ్బంది

కొయ్యూరు తహసీల్దార్‌గా ప్రసాద్



కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు నూతన తహసీల్దార్‌గా **ఎస్ఎల్వీ ప్రసాద్** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గూడెంకొత్తవీధి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు హెచ్‌డీటీ కుమారస్వామి ఇన్‌ఛార్జీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఏపీఎంగా సాధన...

కొయ్యూరు, న్యూస్‌టుడే: వెలుగు కొయ్యూరు ఏపీఎంగా కె. సాధన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు హెచ్‌డీ సీసీ గాంధీ ఏపీఎంగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. గాంధీ రాంబిల్లి మండలానికి బదిలీ అయ్యారు. సాధన రోలుగుంట మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీపీ రమేష్‌బాబుని ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

చింతపల్లి ఎస్సైగా వెంకటేశ్వరరావు



చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా **వెంకటేశ్వరరావు** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో పని చేశారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన అరుణ్‌కిరణ్ పాడేరు స్పెషల్ బ్రాంచికి (ఎస్‌బీఐ) బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళుతున్న ఎస్సై అరుణ్‌కిరణ్‌ను చింతపల్లి సీఐ రమేష్, సిబ్బంది సన్మానించారు.

ఆధునిక సాగుపై అవగాహన అవసరం

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మంగంపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచార పరిజ్ఞానాన్ని, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. వరి క్షేత్రాలు సందర్శించి జిల్లేడు, కాషాయం తయారీ విధానం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచి వేమ సంధ్యారాణి, వ్యవసాయ సహాయకురాలు ఎస్ సుష్మ, వెటర్నరీ అసిస్టెంట్ భద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇంజిరిలో పొలం పిలుస్తోంది...

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంజిరి సచివాలయం మల్లెపుట్టు, లింగేటి పంచాయతీ కొత్తూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలు, చిరు ధాన్యాల ఆవశ్యకత, వ్యవసాయ యాంత్రీకరణ, సహజ వ్యవసాయ పద్ధతులు వివరించారు. ఉద్యాన సహాయకులు కె సూభాకార్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

అరకులోయ, న్యూస్‌టుడే: ఔత్సాహిక క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పూర్వ క్రీడాకారుల సంఘం ప్రతినిధులు బురిడి ఆనందరావు, శ్రీను కోరారు. అరకులోయలోని వాలీబాల్ మైదానంలో క్రీడాకారుల సౌకర్యార్థం పంచాయతీ ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. పూర్వ క్రీడాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీటిని ప్రారంభించారు. పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

కాలువల్లో వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం



కాలువల్లో వ్యర్థాలను తొలగించిన పారిశుద్ధ్య కార్మికుడు

చింతపల్లి,న్యూస్‌టుడే: చింతపల్లిలో ప్రధాన రహదారికి ఆనుకుని కాలువల్లో పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిపై 'ఈనాడు'లో మేమున్నాం మీకుతోడుగా శీర్షిక కింద మంగళవవారం వార్త ప్రచురితమైంది. చింతపల్లి ఎంపీడీఓ ఆశాజ్యోతి స్పందించి పంచాయతీ అధికారులతో మాట్లాడారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించింది.

ప్రాంతీయాసుపత్రిలో రోగులకు సక్రమంగా అందని సేవలు



ఆసుపత్రిలో సేవలపై ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు ప్రభావతిని ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందటం లేదని ప్రధానంగా గర్భిణులకు ప్రసూతి వైద్యనిపుణుల సేవలు దూరమవుతున్నాయని, వీటిని మెరుగుపర్చాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజుబాలయ్య కోరారు. చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సామాజిక ఆసుపత్రిగా ఉన్న చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అందుకు తగ్గ వసతులు, రోగులకు నిణులతో కూడిన వైద్యసేవలు సక్రమంగా అందటం లేదని సమావేశంలో పలువురు సభ్యులు ప్రస్తావించారు. దీనిపై ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు ఆసుపత్రి పర్యవేక్షకురాలు ప్రభావతిని వివరణ అడిగారు. ప్రసూతి వైద్యనిపుణులు సెలవులపై వెళ్లడంతో ఇబ్బంది తలెత్తుతోందన్నారు. జనరల్ ఫిజిషియన్ పోస్టు భర్తీ చేయకపోవడంతో కొందరు రోగులను తప్పనిసరి పరిస్థితుల్లో పాడేరు, నర్సీపట్నం ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోందన్నారు. చింతపల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే వసతి సమస్య తీరుతుందని ఆమె తెలిపారు. చింతపల్లిలో పందుల సంచారాన్ని నియంత్రించాలని ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి కోరారు. శాఖల వారీగా చేపడుతున్న పనులు, పథకాల వివరాలను సభ్యులకు సమావేశంలో అధికారులు వివరించారు. ఎంపీడీఓ ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీలు గోపీనాయక్ శారదా, వెంగళయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఉద్యాన అధికారి కర్ణ, ఎంఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మండలం నుంచి ఇటీవల బదిలీ అయిన చింతపల్లి, లంబసింగి, కొత్తపాలెం పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, గోవిందు, రాజేష్‌లను సమావేశం అనంతరం సత్కరించారు.